




Truth of News

PRGI Reg No: APTEL/26/A4784

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 327 | సోమవారం 15 జూన్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## శాంతి చర్చల వేళ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి హేయం : ట్రంప్ ఆగ్రహం

- తక్షణమే సంయమనం పాటించాలన్న అమెరికా అధ్యక్షుడు
- ప్రాంతీయ శాంతికి విఘాతం కలిగించే చర్యలపై ఆందోళన
- ఉద్రిక్తతల మధ్య శాంతి చర్చల భవితవ్యంపై సందిగ్ధత

2లో



## భారత తదుపరి ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకం

8లో



## నీట్ లీకేజీపై భగ్గుమన్న హైదరాబాద్..

- ధర్నా చౌక్ వద్ద సీజేపీ భారీ ఆందోళన
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: సీజేపీ అధినేత అభిజిత్
- నీట్ లీకేజీపై దేశవ్యాప్త పోరాటానికి పిలుపు
- విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దంటూ ఆగ్రహం

2లో



## ఘోర ప్రమాదం..

- పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు...

- కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం
- సోషల్ మీడియాలో కనిపించని వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఈ చర్యలన్న జగన్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- న్యాయపరంగా పోరాడతామని స్పష్టీకరణ

2లో

## అమరావతి పనులు ఆగలేదు..

- జోరుగా సాగుతున్నాయి: మంత్రి లోకేశ్
- అమరావతి రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయన్న మంత్రి
- పనులపై జరుగుతున్న విష ప్రచారాన్ని ఆపాలని హితవు
- వర్షం వస్తే పనులు ఆగిపోతాయన్న వార్తలను ఖండించిన లోకేశ్
- పనుల పురోగతిని చూపిస్తూ 'ఎక్స్' వేదికగా వీడియో విడుదల

2లో

# ప్రధాని మోదీకి మాక్రాన్ ఆత్మీయ స్వాగతం

- జీ7 శిఖరాగ్ర సమావేశం కోసం ఫ్రాన్స్ చేరుకున్న ప్రధాని మోదీ
- నైస్ నగరంలో ఆలింగనం చేసుకుని స్వాగతం పలికిన మాక్రాన్
- సంయుక్తంగా 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమ ప్రారంభం



నైస్ (ఫ్రాన్స్) - సూర్య వాస్తవం

జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఫ్రాన్స్‌కు చేరుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఫ్రాన్స్‌లోని నైస్ నగరంలో ప్రధాని మోదీకి స్వాగతం పలికిన మాక్రాన్, ఆయనను ఆలింగనం చేసుకుని సాదరంగా ఆహ్వా నిం చారు. ఇరు దేశాధినేతల మధ్య స్నేహ పూర్వక వాతావరణం కనిపించింది. అనంతరం ఇద్దరు నేతలు కలిసి 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం భారత్--ఫ్రాన్స్ ఆవిష్కరణలు, సాంకేతికత, స్టార్టప్‌ల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే

- మిగతా 2లో..

# విహారయాత్రలో విషాదం

- కృష్ణా నదిలో పడవ బోల్తా
- నలుగురు దుర్మరణం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

అచ్చంపేట - సూర్య వాస్తవం

విహారయాత్ర విషాదాంతంగా ముగిసింది. బంధువుల ఇంటికి వచ్చి సరదాగా కృష్ణా నదిలో విహారం చేద్దామని నాటు పడవలో వెళ్లిన పది మందిలో నలుగురు దుర్మరణం చెందారు. వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామం వద్ద జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కోనూరు గ్రామానికి చెందిన గంధం గంగయ్య

- మిగతా 2లో..





## అమెరికా నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు

- ప్రధాని మోడి ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా :రాహుల్ గాంధీవిమర్శలు

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని మోడీ ప్రభుత్వంపై 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు.

- మిగతా 2లో..

## శాంతి ఒప్పందంపై అనిశ్చితిసమీక్ష తర్వాతే నిర్ణయం : ఇరాన్

8

## డబ్బుఇది తీవ్రమైన క్విడ్ ప్రోకో ఆఫర్

- డబ్బుతో న్యాయాన్ని కొనేందుకు బరితెగింపు
- అదానీ ప్రతిపాదనపై మండిపడ్డ డెమొక్రాట్ సెనెటర్లు
- తాత్కాలిక అటార్నీ జనరల్‌కు లేఖ

8

## సింగపూర్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

- రెండు రోజుల పర్యటన కోసం సింగపూర్ చేరుకున్న సీఎం చంద్రబాబు
- ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన తెలుగు ఎన్ఆర్ఐలు
- కుటుంబాలతో తరలివచ్చి అభిమానం చాటుకున్న ప్రవాసులు
- అందరినీ ఆప్యాయంగా పలకరించి ఫోటోలు దిగిన చంద్రబాబు
- తెలుగు ప్రజలు చూపిన ప్రేమ ఎంతో ఆనందాన్నిచ్చిందని వెల్లడి




అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల (జూన్ 15, 16) పర్యటన నిమిత్తం సింగపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐలు) ఆయనకు

- మిగతా 2లో..

## వర్షం వస్తే రోడ్లపై ఉండాల్సిందే

- అవసరమైతే నేనూ వస్తా
- ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- జూన్ 1న చెప్పినా... నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- మరోసారి అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు
- ఇప్పటికైనా వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయ శాఖ అధికారులు సన్నద్ధం కావాలి
- విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలని ఆదేశం



హైదరాబాద్- సూర్య వాస్తవం

'వర్షాకాలం నేపథ్యంలో ఈనెల 1న నేను సమీక్ష నిర్వహించా. అనేక సూచనలు చేశా. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించా రు. దాంతో ఈనెల 9న వర్షం వచ్చిన సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వ యం లోపించింది. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## శాంతి చర్చల వేళ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి హేయం: ట్రంప్ ఆగ్రహం

- తక్షణమే సంయమనం పాటించాలన్న అమెరికా అధ్యక్షుడు
- ప్రాంతీయ శాంతికి విఘాతం కలిగించే చర్యలపై ఆందోళన
- ఉద్రిక్తతల మధ్య శాంతి చర్చల భవితవ్యంపై సందిగ్ధత

**వాషింగ్టన్ – సూర్య వాస్తవం:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇరాన్‌తో కీలక శాంతి చర్చలు ప్రారంభం కానున్న తరుణంలో లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందించిన ట్రంప్, ప్రస్తుత పరిస్థితుల్లో ఇరుపక్షాలు సంయమనం పాటించాలని సూచించారు. ప్రాంతీయ శాంతి ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలు ఎవరూ చేపట్టరాదని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు తన రక్షణ హక్కు ఉన్నప్పటికీ, పరిస్థితులను మరింత ఉద్రిక్తం చేసే భారీ ప్రతిదాడులు ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే లెబనాన్ భూభాగంలో మరిన్ని దాడులు జరగకుండా చూడాలని కోరారు. అదే సమయంలో హెజ్బొల్లా సహా ఇతర సాయుధ గ్రూపులు కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడకూడదని ట్రంప్ స్పష్టం చేసినట్లు సమాచారం. బీరుట్ దక్షిణ ప్రాంతంలోని ఒక కీలక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడులు నిర్వహించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను తగ్గించేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాల నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ దాడుల ప్రభావం శాంతి చర్చలపై ఎలా ఉంటుందనే అంశంపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. అయితే, ఈ ఘటనపై సంబంధిత దేశాల అధికారిక ప్రకటనలు, దౌత్యపరమైన చర్చలు కొనసాగుతున్నాయి. పరిస్థితులు వేగంగా మారుతున్నందున మరిన్ని వివరాలు అధికారిక వర్గాల నుంచి వెలువడాల్సి ఉంది.

## ప్రధాని మోదీకి మాక్రాన్ ఆత్మీయ స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు సమా చారం. ఈ కార్యక్రమంలో భారత్, ఫ్రాన్స్‌తో పాటు పలు దేశాలకు చెందిన స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, పెట్టుబడిదారులు పాల్గొంటున్నారు. ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలపై చర్చలు జరగనున్నాయి. జీ7 సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీ ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, ఇంధన భద్రత, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై చర్చలు జరగనున్నట్లు దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్--ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ పర్యటన కీలకంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## అమెరికా నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు

(మొదటి పేజీ తరువాయి)

"అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. "అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదు" అన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే, దేశాన్ని అవమానించే వాళ్లే ఆయన నియంత్రణలో ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలి" అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

## సింగపూర్‌లో చంద్రబాబుకు ఘనస్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

అపూర్వ రీతిలో ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు రాక గురించి తెలుసుకున్న తెలుగు ఎన్ఆర్ఐలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. ముఖ్యమంత్రి పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటూ సందడి చేశారు. వారి ఆప్యాయతకు స్పందించిన చంద్రబాబు, ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ, వారితో కలిసి ఫోటోలు దిగారు.

ఈ సందర్భంగా చంద్రబాబు తనను కలవడానికి వచ్చిన తెలుగు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. "నాకు, నా బృందానికి ఘన స్వాగతం పలికిన తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు మీ కుటుంబాలతో కలిసి వచ్చి చూపిన ప్రేమ, ఆప్యాయత నాకు ఎంతో ఆనందాన్నిచ్చాయి. మీ అందరితో మాట్లాడటం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. మీలో ప్రతి ఒక్కరి మద్దతును ఎప్పటికీ మరువలేను" అని చంద్రబాబు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు సింగపూర్‌లో జరగనున్న పలు అధికారిక కార్యక్రమాల్లో చంద్రబాబు పాల్గొననున్నారు.

**పడవ ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి...**

పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన, ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో ఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయంగా రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంపై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో కూడిన బృందంతో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యలు, తదుపరి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యతను విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథ్, జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.

పడవలో ప్రయాణిస్తున్న మిగతా ఆరుగురు సురక్షితంగా ఉన్నారని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## విహారయాత్రలో విషాదం

(మొదటి పేజీ తరువాయి)

ఇంట్లో జరిగిన ప్రార్థన కార్యక్రమానికి గంగయ్య కూతురు, మరదలు, బంధువులు మూడు రోజుల క్రితం వచ్చారు. సోమవారం ఉదయం తిరుగు ప్రయాణం అవుదామన్న క్రమంలో పిల్లలతో కలిసి సరదాగా కృష్ణా నదిలో నాటు పడవపై విహారయాత్ర చేయాలని అనుకున్నారు. గంధం గంగయ్య కుమారుడు సత్యానందం తన పిల్లలతోపాటు ఏడుగురు పిల్లలను, తన బంధువులకు చెందిన మరో యువకుడిని తీసుకొని కృష్ణా నది వద్దకు ఆదివారం వెళ్లారు. కృష్ణా నదిలో చేపలు పట్టే నాటు పడవలో అందరూ నదిలోకి వెళ్లారు. నదిలో ఇసుక గుంతలు ఉండడం, లోతుకు వెళ్లడంతో పడవ అటూఇటూ కదిలింది. దీంతో, వారందరూ భయంతో ఒకవైపునకు రావడంతో పడవ బోల్తా కొట్టి అందరూ నదిలో పడిపోయారు. గంధం సంధ్య (9), గంధం షైనీ (11), బత్తుల కార్తీక్ (14), కొనతల చైతన్య (20) గల్లంతయ్యారు. మిగిలిన ఆరుగురూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. గల్లంతైన వారి కోసం గాలించగా నలుగురి మృతదేహాలూ బయటపడ్డాయి. చిన్నారులు సంధ్య 3వ తరగతి, షైనీ 4వ తరగతి చదువుతున్నారు. రెండు రోజుల్లో బడికి పోతామంటూ ముద్దుముద్దు మాటలతో చెప్పిన వారు నిర్జీవంగా కనపడటంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగి పోయారు. బత్తుల కార్తీక్ రొంపిచర్ల మండలం మర్రి చెట్టుపాలెం గ్రామంలో 8వ తరగతి చదువుతు న్నాడు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి అరుణ కళ్లు తిరిగి పడిపోయారు. చిలకలూరిపేటకు చెందిన కొనతల చైతన్య మృతదేహం వద్ద తల్లిదండ్రులు శ్రీనివాసరావు, పూర్ణ కుమారి రోదన వర్ణనాతీతంగా ఉంది. చిలకలూరిపేటలోని సంజీవ్ నగర్‌కు చెందిన చైతన్య డిగ్రీ పూర్తి చేసుకుని హైదరాబాదులో ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. కోనూరు బంధువుల ఇంటికి వచ్చి మృత్యువాత పడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అనుకున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ పి. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా పల్నాడు జిల్లా కోనూరు వద్ద కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సింగపూర్‌లో ఉన్న ఆయన ఈ ఘటనపై పల్నాడు జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. పడవ బోల్తా ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు తక్షణమే ఈ మొత్తాన్ని చెల్లించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారుల బృందంతో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో మృతుల కుటుంబాలకు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చెక్కులను అందజేశారు. పడవ ప్రమాదం పట్ల సిపిఎం విచారం పల్నాడు జిల్లా కోనూరులో కృష్ణా నదిలో పడవ బోల్తాపడి ముగ్గురు చిన్నారులతో సహా నలుగురు మరణించడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ విచారం వ్యక్తం చేసింది. మరణించినవారికి సంతాపం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ?

## వర్షం వస్తే రోడ్లపై ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అధికారులపై చర్యలు తీసుకోవాలి...' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. వర్షాలు వచ్చినప్పుడు అధికారులు, పోలీసులు అందరూ రోడ్లపైనే ఉండాలని ఆదేశించారు. అవసరమైతే తానూ వస్తానని తెలిపారు. ?వర్షాలు పడినప్పుడు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించా రు. వర్షాకాల సన్నద్ధతపై ఆదివారం హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష? సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఈనెల 9న ఏర్పడిన పరిస్థితులపై ఆరా తీశారు. సైబరాబాద్ తోపాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. ఆ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం పడిన సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిందేనన్నారు.

పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తానూ రోడ్డుపైకి వస్తానని చెప్పారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.

వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు.

**విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలి**

వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు. యూరియా స్టాక్ , పంపిణీ కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**తాగునీరు కలుషితం కాకుండా చూడాలి**

వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు...

- కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం
- సోషల్ మీడియాలో కనిపించని వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఈ చర్యలన్న జగన్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- న్యాయపరంగా పోరాడతామని స్పష్టీకరణ



**అమరావతి – సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

# ఘోర ప్రమాదం..

## - పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

# అమరావతి పనులు ఆగలేదు..

- జోరుగా సాగుతున్నాయి: మంత్రి లోకేశ్
- అమరావతి రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయన్న మంత్రి
- పనులపై జరుగుతున్న విష ప్రచారాన్ని ఆపాలని హితవు
- వర్షం వస్తే పనులు ఆగిపోతాయన్న వార్తలను ఖండించిన లోకేశ్
- పనుల పురోగతిని చూపిస్తూ 'ఎక్స్' వేదికగా వీడియో విడుదల



**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా, ఎక్కడా విరామం లేకుండా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాజధాని పనులు ఆగిపోయాయని, చిన్న వర్షానికే మునిగిపోతోందని కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. "అమరావతిలో పనులు ఏమాత్రం ఆగడం లేదు. వర్షం కురిస్తే మునిగిపోయిందంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. కానీ, నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాజధానిలో ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ప్రధాన రహదారులు, రిజర్వాయర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మిస్తున్న టవర్లు, మంత్రుల బంగ్లాల నిర్మాణాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఇకనైనా విష ప్రచారాన్ని ఆపండి" అని చెప్పిన ఓ వీడియోను మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను వీడియో రూపంలో ప్రజల ముందు ఉంచి, అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారానికి మంత్రి లోకేశ్ గట్టిగా బదులిచ్చారు.

# నీట్ లీకేజీపై భగ్గుమన్న హైదరాబాద్..

- ధర్నా చౌక్ వద్ద సీజేపీ భారీ ఆందోళన
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: సీజేపీ అధినేత అభిజిత్
- నీట్ లీకేజీపై దేశవ్యాప్త పోరాటానికి పిలుపు
- విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దంటూ ఆగ్రహం

**హైదరాబాద్, - సూర్య వాస్తవం:**

దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నీట్ పేపర్ లీకేజీ ఘటనపై హైదరాబాద్‌లో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. సీజేపీ కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు ఆదివారం హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత, నీట్ అభ్యర్థులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేశారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ప్రముఖ విద్యావేత్త కె. నాగేశ్వర్, పర్యా వరణవేత్త సోనం వాంగ్‌చుక్ పాల్గొని నిరసనకారులకు మద్దతు తెలిపారు. అలాగే డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐతో పాటు వివిధ విద్యార్థి, యువజన సంఘాలు కూడా సంఘీ భావం ప్రకటించాయి. సీజేపీ అధినేత అభిజిత్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రాజీనామా చేసేంత వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద కూడా ఇదే అంశంపై పెద్ద ఎత్తున నిరసనలు జరిగినట్లు తెలిపారు.

# జవహర్‌నగర్: కళ్లముందే జరుగుతున్న పర్యావరణ విపత్తు

**డా. ముచ్చుకోట సురేష్ బాబు**
**అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక**



ఇరవై ఐదు సంవత్సరాలకు పైగా, హైదరాబాద్ శివార్లలోని జవహర్‌నగర్ పరిసర గ్రామాల ప్రజలు దేశంలోని అతిపెద్ద మున్సిపల్ చెత్తకుప్పల నీడలో జీవిస్తున్నారు. 2001లో మూడు మున్సిపాలిటీల చెత్తను తాత్కాలికంగా పారవేయడానికి ఏర్పాటు చేసిన ఈ ప్రదేశం, నేడు ప్రజారోగ్యం, పర్యావరణ భద్రత, వాతావరణ స్థిరత్వాన్ని సవాలు చేస్తున్న విస్తారమైన పర్యావరణ విపత్తు గా మారింది.ఇది ఇక ప్రజల అనుభవాల ఆధారంగా చెప్పబడుతున్న కథ కాదు. ఇది శాస్త్రీయంగా నిర్ధారించబడిన, సహచర శాస్త్రవేత్తల సమీక్షకు లోనైన, అంతర్జాతీయంగా ధృవీకరించబడిన వాస్తవం.ఇటీవల యుసిఎల్ఏ స్టాప్ మీథేన్ ప్రాజెక్ట్ మరియు కార్బన్ మప్పర్ నిర్వహించిన ఉపగ్రహ ఆధారిత అధ్యయనాలు జవహర్‌నగర్ చెత్తకుప్పను ప్రపంచంలోనే అత్యధిక మీథేన్ వాయువును విడుదల చేస్తున్న వ్యర్థ ప్రదేశాలలో ఒకటిగా గుర్తించాయి. ప్రపంచవ్యాప్తంగా నాల్గవ స్థానంలో ఉన్న ఈ చెత్తకుప్ప ప్రతి గంటకు సుమారు 5.9 టన్నుల మీథేన్‌ను విడుదల చేస్తోంది. ఇది కేవలం స్థానిక చెత్త నిర్వహణ సమస్య మాత్రమే కాదు; ఇది ఒక వాతావరణ అత్యవసర పరిస్థితి.మీథేన్ వాయువు ఇరవై సంవత్సరాల కాలవ్యవధిలో కార్బన్ డైఆక్సైడ్ కంటే సుమారు 86 రెట్లు ఎక్కువ వేడిని బంధించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలలో దీనిది కీలక పాత్ర. జవహర్‌నగర్ స్థాయిలో మీథేన్‌ను విడుదల చేసే చెత్తకుప్ప ప్రభావం ఒక పెద్ద బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం ప్రభావానికి సమానంగా ఉంటుంది. అయితే వాతావరణ మార్పు మాత్రమే ఈ సంక్షోభానికి పరిమితం కాదు.ఈ చెత్తకుప్ప పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు తీవ్రంగా కలుషితమయ్యాయని అనేక శాస్త్రీయ పరిశోధనలు నిరూపించాయి. నీటిలో మొత్తం కరిగిన ఘనపదార్థాలు, నైట్రేట్లు, క్లోరైడ్లు, అలాగే ఆర్సెనిక్, క్యాడ్మియం, క్రోమియం, సీసం, మాంగనీస్ వంటి భార లోహాల స్థాయిలు ప్రమాదకరంగా పెరిగాయి. ఫలితంగా భూగర్భజలాల్లో గణనీయమైన భాగం తాగునీటి గా వినియోగించడానికి అనర్హం గా మారింది.నీటి నాణ్యత సూచిక అధ్యయనాల ప్రకారం పరీక్షించిన నమూనాలలో దాదాపు మూడు వంతులు "నాణ్యతలేని" లేదా అంతకంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. భూగర్భ జలాలపై ఆధారపడే వేలాది కుటుంబాలకు ఇది కేవలం గణాంకం కాదు; వారి ఆరోగ్యానికి, జీవనాధారానికి రోజువారీ ముప్పు.ఇంకా ఆందోళనకరమైన విషయం సమీపంలోని వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి వెలువడుతున్న విషపూరిత ఫ్లై యాష్. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదికల ప్రకారం, ఫ్లై యాష్‌లోని క్యాడ్మియం స్థాయిలు అనుమతించబడిన పరిమితులను వెయ్యి రెట్లు మించిపోయాయి. భద్రంగా నిల్వ చేయాల్సిన ఈ వ్యర్థాలను అదే ప్రదేశంలో పారవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల నేల, నీటి వనరులు మరింత కలుషితమవుతున్నాయి.పర్యావరణ పర్యవేక్షణలో ప్రభుత్వ నియంత్రణ సంస్థలు విఫలమవడం పాలన, బాధ్యతాయుత వ్యవస్థలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.జవహర్‌నగర్ చెత్తకుప్ప చాలా కాలం క్రితమే తన నిర్వహణ పరిమితులను దాటిపోయింది. కొద్దికాలం పాటు పరిమిత స్థాయిలో వ్యర్థాలను స్వీకరించడానికి అనుమతి పొందిన ఈ ప్రదేశంలో ప్రస్తుతం సుమారు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇంకా ప్రతిరోజూ దాదాపు 9,600 మెట్రిక్ టన్నుల కొత్త చెత్త ఇక్కడికి చేరుతోంది.చెత్తకుప్పలోని విస్తారమైన ప్రాంతాలు ఇంకా శాస్త్రీయంగా మూసివేయబడ లేదు. దీనివల్ల లీచేట్ లీకేజీలు, మీథేన్ పేరుకుపోవడం, అగ్నిప్రమాదాలు, భూస్థిరత్వం కోల్పోవడం వంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఢిల్లీలోని ఘాజీపూర్ ల్యాండ్‌ఫిల్ విషాదం మనకు హెచ్చరికగా నిలిచినా, అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరిగింది.

**అయితే అత్యంత విషాదకరమైనది మానవ మూల్యం.**

జవహర్‌నగర్ పరిసర గ్రామాల ప్రజలు దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, చర్మ రుగ్మతలు, జీర్ణకోశ సమస్యలు, నిరంతర తలనొప్పులతో బాధపడుతున్నట్లు నివేదిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు ఈ పర్యావరణ నిర్లక్ష్యానికి అత్యధికంగా బలవుతున్నారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణంలో జీవించే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. సుప్రీంకోర్టు అనేకసార్లు దీనిని పునరుద్ఘాటించింది. అయినప్పటికీ ఈ హక్కు ఇక్కడ నిరంతరం ఉల్లంఘించబడుతోంది. చట్టపరమైన పరిస్థితి కూడా స్పష్టంగానే ఉంది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు--2016, పర్యావరణ పరిరక్షణ చట్టం--1986, నీటి కాలుష్య నివారణ చట్టం--1974, జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు -- వీటన్నింటికీ జవహర్‌నగర్ డంప్‌యార్డ్ కొనసాగింపు విరుద్ధంగా కనిపిస్తోంది.ఐఐటీ బాంబే, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, స్వతంత్ర పరిశోధకులు, అంతర్జాతీయ శాస్త్రీయ సంస్థలు -- అందరూ ఒకే విషయాన్ని చెబుతున్నారు: ప్రస్తుత పరిస్థితి కొనసాగడం అసాధ్యం.వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో వ్యర్థాల నిర్వహణ సవాళ్లను ప్రభుత్వాలు తరచూ ప్రస్తావిస్తాయి. హైదరాబాద్ నిజంగానే భారీ స్థాయిలో చెత్తను ఉత్పత్తి చేస్తోంది. కానీ పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని సమాజాలను శాశ్వతంగా త్యాగం చేయడం న్యాయం కాదు. పర్యావరణ న్యాయం అంటే ఒక నగరానికి చెత్తకుప్పగా ఏ సమాజాన్నీ శాశ్వతంగా మార్చకూడదు.పరిష్కారం అసాధ్యం కాదు. కొత్త చెత్త డంపింగ్‌ను వెంటనే నిలిపివేయడం, పాత చెత్తను శాస్త్రీయంగా కప్పివేయడం, మీథేన్ సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, భూగర్భజలాల పునరుద్ధరణ, ప్రజారోగ్య పర్యవేక్షణ కార్యక్రమాలు, వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ మౌలిక సదుపాయాల అభివృద్ధి -- ఇవన్నీ సాంకేతికంగా సాధ్యమైన చర్యలే. లోటు జ్ఞానంలో కాదు; రాజకీయ సంకల్పంలో ఉంది.జవహర్‌నగర్ నేడు భారత నగరాలు ఎదుర్కొంటున్న ఒక పెద్ద సంక్షోభానికి ప్రతీకగా మారింది. బలహీన వర్గాలపై పర్యావరణ వ్యయాలను మోపే అభివృద్ధి నమూనాకు ఇది అద్దం పడుతోంది.శాస్త్రీయ ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి. చట్టపరమైన బాధ్యతలు నిర్దిష్టంగా ఉన్నాయి. ప్రజల బాధలు నిరాకరించలేనివి.కమిటీలు, అధ్యయనాలు, హామీల సమయం ముగిసింది. జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌ను మూసివేసి, శాస్త్రీయంగా పునరుద్ధరించి, ప్రభావిత ప్రాంతాలను పర్యావరణపరంగా పునర్నిర్మించాల్సిన సమయం ఆసన్నమైంది.ప్రతి రోజూ ఆలస్యం జరగడం అంటే పర్యావరణ నష్టాన్ని మరింత పెంచడం, అన్యాయాన్ని మరింత లోతుగా చేయడమే.చరిత్ర ప్రభుత్వాలను వారు ఎంత చెత్తను సేకరించారనే దాని ఆధారంగా తీర్పు ఇవ్వదు. ఆ చెత్తకుప్ప పక్కన జీవించాల్సి వచ్చిన ప్రజల ప్రాణాలను, గౌరవాన్ని వారు ఎంతవరకు కాపాడారనే దాని ఆధారంగానే తీర్పు ఇస్తుంది.



# కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

**బెంగళూరు - సూర్య వాస్తవం:** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం, పరీక్ష?ల నిర్వహణలో అక్రమాలపై బెంగళూరులో ఆదివారం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించింది. ఈ నిరసనకు అక్కడి యువత పెద్ద ఎత్తున పాల్గొన్నది. కేంద్రంలోని మోడీ సర్కారు తీరుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. సీజేపీ నిరసన ప్రదర్శనలో సీజేపీ వ్యవస్థాపకులు అభిజీత్ దీప్కేతో పాటు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, సినీ నటుడు ప్రకాశ్‌రాజ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కడి యువతను ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రకాశ్‌రాజ్.. కేంద్రంలోని మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. ?ఈ నిరసన ప్రదర్శనకు సంబంధించిన ఓ వీడియోను 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అధికారిక సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. "ప్రజలు ఎన్నుకున్న నాయకులు తమ పని తాము సరిగ్గా చేయాలి. మీరేమో రాజకీయాలు చేస్తున్నారు, మమ్మల్ని ఉద్యోగాలు చేసుకోమంటున్నారు. కానీ ఇప్పుడు దేశంలో సమీకరణాలు మారిపోయాయి. ఈ దేశ యువత తమ హక్కుల కోసం తామే స్వయంగా పోరాడాలని నిశ్చయించుకున్నారు. దేశ యువతంతా



ఒక్కటయ్యారు. రిటైర్మెంట్ వయసు దాటిపోయిన అంకుల్స్, ఆంటీలు ఇంకా ఈ దేశాన్ని పాలిస్తున్నారు. మీరు ఇక తప్పుకోండి. యువత అంతా తమ భవిష్యత్తు కోసం, తమ కలల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడుతోంది" అని ప్రకాశ్ రాజ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

**కుండపోత వర్షం**

ఇటీవలే దేశ రాజధాని న్యూఢిల్లీలో సీజేపీ నిరసనలు హోరెత్తించాయి. దేశవ్యాప్తంగా యువత దృష్టిని ఆకర్షించింది. కేంద్రం వైఫల్యాలను సీజేపీ ఈ నిరసనతో బయటపెట్టింది. ఇప్పుడు ఈ నిరసనల పరంపర దక్ష?ణాదికీ పాకింది. ఆదివారం హైదరాబాద్, బెంగళూరులో సీజేపీ భారీ నిరసనలు చేపట్టింది. ఈ కార్యక్రమాలకు యువతతో పాటు నిరుద్యోగులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు వైఫల్యాలను ఎత్తి చూపారు. కాగా బెంగళూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వందలాది మంది యువతీ యువకులు, విద్యార్థులు నిరసన కోసం ఫ్రీడమ్ పార్కుకు తరలివచ్చారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.?

**దేశవ్యాప్తంగా ఉద్యమం**

సామాజిక మాధ్యమాల వేదికగా దేశంలోని యువతను ఏకం చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఈ ఉద్యమాన్ని నడిపిస్తోంది. గతంలో న్యూఢిల్లీలో భారీ నిరసన చేపట్టిన ఈ సంస్థ, నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించింది. దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

## స్నేహమేరా జీవితం..... స్నేహమేరా శాశ్వతం..!

### పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**అనంతపురం - సూర్య వాస్తవం :** స్నేహం అనేది కేవలం సరదాలకు మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో గొప్ప మార్పులకు, మానసిక ఆరోగ్యానికి, ఆపదలో అండగా నిలవడానికి ప్రతీకగా నిలుస్తోంది.....నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అద్భుతమైన అనుభూతి. సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం ద్వారా పాత బంధాలు బలపడతాయి, ఒత్తిడి తగ్గి మానసిక ఉల్లాసంగా గడిపారు. అనంతపురం పట్టణంలోని ఫాతిమా మీరు ఇంగ్లీష్ తెలుగు మీడియం స్కూల్ 2002 సంవత్సరం కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం నాడు కలిసి ఆనందంగా గడిపారు.అందరూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్ననాటి ఆటలు, పాత ఫోటోల ప్రదర్శన, మరియు అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘల ఆనంద్,హర్ష, అబ్దుల్లా. పవన్. కిరణ్. అపర్ణ. మంజుల.కిరణ్మె ,శశికళ.తేజ. పరమేష్, వసంత,ఆచారి, విశ్వనాథ్. శ్రీకాంత్.చక్రి, వెంకటేష్, చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు,

## ట్రిబుల్ ఐటీకి ఎల్లనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక



**ఎల్లనూరు - సూర్య వాస్తవం :** మండల పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థిని యజ్ఞశ్రీ పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, ఉన్నత చదువులకు ఎంపికైంది. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఆమె 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆమె చూపిన ప్రతిభకు గాను ప్రతిష్టాత్మకమైన శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీ లో సీటు లభించింది. గ్రామీణ ప్రాంతం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఇంతటి ఘనత సాధించడం విశేషం.

**ఘనంగా అభినందనలు**

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శేఖర్, ఉపాధ్యాయ బృందం యజ్ఞశ్రీని, ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. యజ్ఞశ్రీ సాధించిన ఈ విజయం పాఠశాలకే కాకుండా, యావత్ ఎల్లనూరు మండలానికే గర్వకారణమని వారు కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## విద్యుత్ అధికారులకు జెడ్ వీరా రెడ్డి కాలనీపై ఎందుకింత చిన్న చూపు



**గుత్తి - సూర్యవాస్తవం:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జెడ్ వీరారెడ్డి కాలనీ నందు వర్షం రావ డంతో తెల్లవారుజామున నాలుగు గంటలకు కరెంటు పోయింది. విద్యుత్ అధికారులు 12 గంటలు అయి నా స్పందించకపోవడం ఏమిటని కా లనీ వాసులు వాపోతున్నారు.గత రెండు వారాల క్రితం సాయంత్రం ఐ దు గంటలకు వర్షం మొదలు కాగానే కరెంటు తీసివేయడం జరిగింది.అ నంతరం మరుసటి రోజు మధ్యా హ్నం రెండు గంటల వరకు కరెంటు లేక కాలనీవాసులు ఎన్నో ఇబ్బందు లు ఎదుర్కొన్నారు.జెడ్ వీరారెడ్డి కా లనీ నందు ఎక్కువ శాతం చిన్న చి న్న వ్యాపారాలు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు.వారు తెల్లవారు జామున లేచి వంట వండుకొని వ్యా పారం నిమిత్తం గ్రామాలకు వెళ్తుం టారు.అలాంటి కాలనీకి విద్యుత్ అంతరాయం కలిగించడం ఎంతవ రకు న్యాయమని వారు ప్రశ్నిస్తు న్నారు. రాత్రి వేళల్లో కరెంటు లేక పోవడంతో విషాలు సర్పాలు,తేళ్లు, విష కీటకాలు తిరుగుతూ ఉంటా యని వాటివల్ల ప్రమాదం ఏర్పడతా యని కాలనీ వాసులు తెలిపారు. విద్యుత్ అధికారులు జెడ్ వీరారెడ్డి కాలనీ పై ఎందుకు అంత చిన్న చూపు అని ప్రశ్నిస్తున్నారు. కరెంటు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నాం కదా ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నా రని కాలనీవాసులు తెలుపుతున్నా రు.విద్యుత్తు సిబ్బందికి ఫోన్ చేసి క రెంటు ఎప్పుడు వస్తుంది అని అడి గితే ఒకరిపై ఒకరు సాకులు చెప్పు కుంటున్నారు.ఇలాగే విద్యుత్ అధి కారులు ప్రవర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఖాయమని కాల నీవాసులు తెలుపుతున్నారు.ఇప్ప టికైనా విద్యుత్తు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.డి ఈకి వివరణ కోర గా జరిగిన విషయం గురించి హార తిసి విద్యుత్ సిబ్బందితో మాట్లాడి విద్యుత్తు అంతరాయం కలగకుండా చూస్తామని వారు తెలియజేశారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**- కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే**
**- లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ వీరుపాక్షి రెడ్డి**



**పామిడి -సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ పరమేశ్వరి కళ్యాణ మండపం నందు ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వీరుపాక్షి రెడ్డి శంకర కంటి ఆసుపత్రి బెంగుళూరు కంటి వైద్య నిపుణులు డాక్టర్ అభిషేకం మాట్లాడుతూ... కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు, నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా, వైరస్,ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. పామిడి లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పట్రా శ్రీనివాసులు,. ప్రెసిడెంట్ రఘువీర్ రావు మాట్లాడుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర అభిషేకం . కంటి వైద్య శిబిరానికి వచ్చిన 260 మందిని పరీక్షించి అందులో 123 మందిని కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు క్లబ్ కోశాధికారి డి. షేక్షావలి, ఉపకార్యదర్శి ముం దే షేక్షావలి. క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగ శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్, ,డైరెక్టర్స్ ఎం .నాగరాజు . శ్రీనివాస్ . భాష . ప్రసాద్ . పట్ర రాకేష్, అంజి నాయక్ .రామాంజనేయులు . నల్లయ్య శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ రాకేష్ శంకర హాస్పిటల్ సిబ్బంది లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన రాగిరి రామయ్య

**- ఘనంగా స్వాగతం పలికిన అవుట్ గోయింగ్ సిఐ కౌలుట్లయ్య**



**శింగనమల- సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా శింగనమల నూతన సీఐగా రాగిరి రామయ్య నేడు బాధ్యత లు స్వీకరించారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ప్రస్తుతం సింగనమల సీఐగా విధులు నిర్వహించి, అనంతపురం వీఆర్‌కు బదిలీ అయిన కౌలుట్లయ్య నూతన సీఐ రామయ్యకు శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా నూతన సీఐ రాగిరి రామయ్య మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా తాను పనిచేస్తానని స్పష్టం చేశారు.నియోజకవర్గ పరిధిలో చట్టవ్యతిరేక కార్య కలా పాలకు పాల్పడే వారిపై, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదంతో అణచి వేయడం తనకు కొట్టిన పిండని, ఎట్టిపరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**వివాద రహితుడు పేదల పక్షపాతి**

రాగిరి రామయ్య పోలీస్ శాఖలో సుదీర్ఘమైన, సమర్థవంతమైన ట్రాక్ రికార్డ్ ఉంది.గతంలో ఆయన ఉరవకొండ, గుంతకల్లు, అనంత పురం తదితర ప్రాంతాల్లో ఎలాంటి వివాదాలు, అరమరికలు లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారు. ఆయా ప్రాంతాల్లో సేవలందించిన అనంతరం ఆయన పదోన్నతి (ప్రమోషన్) పై తిరుపతికి బదిలీ అయ్యారు. తాను పనిచేసిన ప్రతి చోటా పేదల పక్షాన నిలబడి, బాధితులకు న్యాయం చేస్తూ సేవాలందించడం ఆయన ప్రత్యేకత.ఆర్టీసీ సెక్యూరిటీ ఆఫీసర్ నుండి సివిల్ సీఐ వరకు రాగిరిరామయ్య ప్రస్థానం ఎందరికో ఆదర్శనీయం. మొదట్లో ఆయన ఉరవకొండ ఏపీఎస్ ఆర్టీసీలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా తన విధులను ప్రారంభించారు. ఆ తర్వాత శాఖాపరమైన మార్పుల ద్వారా సివిల్ ఎస్ఐగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు. కష్టపడి పనిచేసే తత్వంతో, నిజాయితీతో పనిచేసిన ప్రతి చోటా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్, సొంత ఇమేజ్‌ను సృష్టించుకున్నారు. శింగనమల సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన నేతృత్వంలో నియోజక వర్గం మరింత ప్రశాంతంగా మారుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డ్రోన్ కెమెరాలతో పోలీసుల తనిఖీలు





**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శాంతిభ ద్రతల ప రిరక్షణలో భాగంగా గుత్తి యు.పి.ఎ స్ పోలీసుల ఆధ్వర్యంలో ఈరోజు గుత్తి పరిసరాలు, పాత కర్నూలు రోడ్డు సమీపంలోని పొలా లు,మరియు అటవీ ప్రాంతాలలో డ్రోన్ కెమెరాల సహాయంతో విస్తృ తంగా తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కా రం ఉన్న ప్రాంతాలు,అనుమానాస్ప ద కదలికలు,మరియు నేరస్థులు దాక్కునేందుకు వీలున్న ప్రదేశాలపై ని ఘా ఉంచేందుకు అధునాతన డ్రోన్ సాంకేతికతను పోలీసులు ఉపయో గించారు.ముఖ్యంగా మనుషులు సులభంగా వెళ్ళలేని అటవీ ప్రాంతా లు,దట్టమైన కొండ గుట్టలు,పొలా ల్లో సైతం ఈ డ్రోన్ల ద్వారా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.?ఈ సందర్భంగా పోలీ సులు మాట్లాడుతూ.జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను కాపా డటానికి,నేరాలను అదుపు చేయ డానికి ఇలాంటి ఆధునిక సాంకేతిక తనిఖీలు నిరంతరం కొనసాగుతా యని తెలిపారు.ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ శాఖ పని చేస్తోంద ని,పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అను మానాస్పదంగా కనిపిస్తే వెంటనే పో లీసులకు సమాచారం అందించాలని వారు కోరారు.

## 28 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు..



**కనేకల్లు -సూర్య వాస్తవం:** కణేకల్ మండలంలోని మాల్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 28 ఏళ్ల అనంతరం ఆదివారం ఒకేచోట చేరి సందడి చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగరాజు, నాగప్ప శెట్టి, ప్రణవానంద, ఉమామహేశ్వర్, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, నాజార్, సత్యనారాయణ, విజయకుమార్, గోపాల్ రెడ్డిలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత అందరూ ఒకేచోట కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ కలయిక చిరస్మరణీయంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిక్కన్న, అల్లిపీరా, సిద్దప్ప, నాగరాజు, శివకుమార్, రమేష్, కోరి గోవర్ధన్, మారెన్న, చిన్న మల్లేష్, యువరాజు, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలే అసలైన హీరోలు : తులసి రెడ్డి

**- రక్తదాతలు సృష్టికర్త బ్రహ్మదేవునితో సమానం అని వ్యాఖ్య**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు రక్తదాతలను ఘనంగా సన్మానించారు. వేంపల్లి ఆర్య వైశ్య సంఘానికి చెందిన పుల్లకూర గోవర్ధన్, రాయవరం వెంకట సుబ్బారావులు సుమారు 20 సార్లు రక్తదానం చేసి అనేక మంది ప్రాణాలను కాపాడటంతో పాటు మరెందరికో రక్తదానం చేయడానికి ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ రక్తదాతలు సమాజానికి అసలైన హీరోలని కొనియాడారు. ఆస్ట్రియన్ శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్‌స్టీనర్ జన్మదినమైన జూన్ 14ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ రక్తదాన దినోత్సవంగా గుర్తించిందని తెలిపారు. రక్తం అవసరంపై అవగాహన కల్పించడం, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేయడం, మరింత మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడగలదని అన్నారు. 18 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆరోగ్యవంతులైన వ్యక్తులు నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం వల్ల నీరసం వస్తుందనే అపోహలు నిజం కావని, ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని చెప్పారు. "ఒకప్పుడు అన్నదానం గొప్పదనం అయితే, నేటి సమాజంలో రక్తదానం ప్రాణదానం"అని పేర్కొన్న తులసి రెడ్డి, రక్తదాతలు మానవత్వానికి ప్రతీకలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, సీనియర్ నాయకులు ఉత్తన్న, బద్రీనాథ్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మొఘల్ అమీర్ బేగ్ కుమార్తె నిఖా వేడుకలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి మండిపల్లి



**రాయచోటి–సూర్య వాస్తవం:** పట్టణంలోకల్యాణ మండపాలు కళ కళ లాడుతున్నాయి. పెల్లి మండ పాలు ఉదయం రంగురంగుల పూలతో కళకళ అంటే.. శని వారం రాత్రి పంచరంగుల విద్యుత్ దీప కాంతులతో ధగ ధగ లాడుతున్నాయి. బంధు వులు, కుటుంబ సభ్యులతో కిటికిటలాడుతున్నాయి. ప్రయాణ ప్రాంగణాలూ రద్దీగా మారాయి. పట్టణంలో ఈ ఒక్కరోజే 25 వివాహాలు జరినట్లు పట్టణ ప్రముఖ పెళ్లిళ్ల పేరయ్యల సమాచారం. ఓకే రోజు ఎక్కువ పెళ్లిళ్లు శుభకార్యాలు ఉండడంతో ఎటువైపు వెళ్ళాలో బంధు మిత్రులకు, రాజకీయ శ్రేణులకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగా నే ఆదివారం స్థాని 'లయ గార్డెన్'లో పట్టణానికి చెందిన ప్రముఖుడు మొఘల్ అమీర్ బేగ్ కుమార్తె నూరెచశ్మి, గాలివీడు దస్తగీర్ కుమారుడు అక్బర్ బాషా నిఖా వేడుకల్లో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మరియు అతని తనయుడు, రాజకీయ యువ కిషోరం యం. నిశ్చల్ నాగిరెడ్డి సంయుక్తంగా పాల్గొని వివాహశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొగల్ అమీర్ బేగ్, షేక్ దస్తగిరి, మొగల్ జహీర్ బేగ్, మొగల్ సుబహాన్, అన్వర్, బాబర్ బేగ్, జలాల్, షానవాజ్ స్థానిక టిడిపి నాయకులు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా

# వేంపల్లెలో ముమ్మర వాహన తనిఖీలు



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లె పట్టణంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు పోలీసులు ఆదివారం ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమంలో భాగంగా వెంపల్లె సీఐ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ముఖ్య రహదారులపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లను పోలీసులు ఆపి సంబంధిత పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా నంబర్ ప్లేట్లు సరిగా లేని వారు, హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారు, త్రిబుల్ రైడింగ్‌కు పాల్పడిన వారిపై మోటార్ వాహన చట్టం కింద కేసులు నమోదు చేసి అక్కడికక్కడే ఈ–చలాన్లు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## నేటి నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**- జులై 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారి పేర్ల నమోదుకు అవకాశం**

**- తహసీల్దారు జె . శివశంకర్ రెడ్డి**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వేంపల్లె మండలంలో ప్రత్యేక తీవ్ర ఓటర్ల జాబితా సవరణ––2026 కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుంచి జులై 14 వరకు నిర్వహించనున్నట్లు సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దారు జె. శివశంకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, చిరునామా మార్చుకున్న వారు, నకిలీ నమోదులను గుర్తించి తొలగిస్తామని చెప్పారు. 01-07-2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతకు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమకు అందజేసే లెక్కింపు పత్రాలను పూర్తిగా నింపి అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత కొలువు స్థాయి అధికారికి అందజేయాలని సూచించారు. తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని కోరారు. ఇంటింటికి వచ్చే కొలువు స్థాయి అధికారులకు ప్రజలు సహకరించి సరైన, నిష్పక్షపాత ఓటర్ల జాబితాల తయారీలో భాగస్వాములు కావాలని తహసీల్దారు విజ్ఞప్తి చేశారు.

# బీసీల పక్షపాతి. ఎన్డీఏ ప్రభుత్వం....

**- హలో బీసీ ఛలో ఢిల్లీ**

**- వై.నాగేశ్వరరావు యాదవ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, డీసీఎంఎస్ చైర్మన్**



**కర్నూల్– సూర్య వాస్తవం :** కర్నూలు పట్టణం నందు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు యాదవ్ కార్యాలయం లో ఏర్పాటుచేసిన కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై బీసీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ ఇన్చార్జి కరివేనా వేణుమాధవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విజయకుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంబాబు గారు మరియు ,జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలకు స్వతంత్రం వచ్చినప్పటి నుంచి కూడా జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బేతంచెర్ల మండలంలో గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పటిష్టం చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది.



బీసీలు తమ హక్కుల కొరకు పోరాటం చేస్తూ, దేశం, రాష్ట్రం, జిల్లా, మండలం మరియు గ్రామ స్థాయిలో బీసీల చేతి వృత్తుల ద్వారా ఈ దేశానికి ఎంతో సంపదను అందిస్తున్నాము. కానీ బీసీల జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అనేక పోరాటాలు చేయడం జరిగింది. పోరాటాల ఫలితంగానే విద్య, రాజకీయాల్లో, సామాజికంగా ఆర్థిక పరంగా కొన్ని వెసులుబాటులైతే లభించాయి. కానీ, బీసీలకు కేంద్రస్థాయిలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని, పదోన్నతుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో బీసీ విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 % రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది.. అలాగే ,బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ గారికి, ముక్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ గారికి, బీసీ మంత్రి సవితమ్మ గారికి తెలుగుదేశం పార్టీ మంత్రులకు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము. బీసీ భవనాల నిర్మాణం గత ప్రభుత్వంలో ఆగిపోయినా! టీడీపీ ప్రభుత్వం బీసీ భవనాల పునర్నిర్మానం చేపట్టడం, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా బీసీ విద్యార్థులకు ప్రభుత్వమే ప్రత్యేక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. అలాగే జులై 26,27 తేదీలలో హలో బీసీ...ఛలో ఢిల్లీ కార్యక్రమనికి బీసీలందరు పాల్గొని విజయవంతం చేయాలనీ పిలుపునిచ్చారు.

## లాడ్జీలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**- అసాంఘిక కార్యకలాపాలపై కఠిన హెచ్చరిక**





**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లె పట్టణంలో సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం వెంపల్లె పరిధిలోని పలు లాడ్జీలపై ఆకస్మిక దాడులు చేపట్టారు. స్థానిక గండి రోడ్, కడప రోడ్ ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలను వెంపల్లె సీఐ తన సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు, గుర్తింపు కార్డులు, నమోదు రిజిస్టర్లను పరిశీలించి నిబంధనల అమలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల నిర్వాహకులు తప్పనిసరిగా అతిథుల పూర్తి వివరాలు, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

- ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ వి.ఎం. థామస్
- సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 70-90 శాతం వరకు వైద్య ఖర్చుల భారం తగ్గింపు
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ థామస్‌కు ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యం ఘన సన్మానం

# పేద దంపతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సిఎఫ్‌సి సేవలు



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ఆశాజ్యోతి కల్పిస్తూ, అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్న చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ ఆదివారం నాయుడుపేట పట్టణంలోని కే కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ మరియు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పోట్లపూడి రాజేష్, గోను బాబు, అవధానం సుధీర్, నిత్యా కృష్ణారెడ్డి, జువ్వలపాటి మస్తాన్, కాపులూరు చక్రపాణి, ఆకుల కుబేరమణి, పలుకూరు ముత్యాలయ్య, వినుకొండ ధనంజయ, బల్లి ముత్యాలయ్య, చేవూరు చెంగయ్య తదితరులు డాక్టర్ థామస్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

**90 శాతం వరకు విజయవంతమైన చికిత్సలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, డాక్టర్ థామస్ అందిస్తున్న సంతానోత్పత్తి చికిత్సలు అత్యాధునిక సాంకేతికతతో కొనసాగుతున్నాయని, దాదాపు 90 శాతం వరకు విజయవంతమైన ఫలితాలను సాధిస్తున్నాయని తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఈ చికిత్సలకు సంబంధించిన ఖర్చులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని పేర్కొన్నారు.

**ప్రతి కుటుంబంలో పిల్లల నవ్వులు వినిపించాలన్నదే లక్ష్యం**

డాక్టర్ వి.ఎం. థామస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి కుటుంబం పిల్లాపాపలతో ఆనందంగా జీవించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. జనాభా సమతుల్యత, కుటుంబ సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.సంతానోత్పత్తి చికిత్సలకు అవసరమైన ఖర్చులో 70 నుంచి 90 శాతం వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అత్యధికంగా నిధులు విడుదల చేయించుకున్న ప్రజాప్రతినిధుల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముందున్నారని, ఆమె కృషితో నియోజకవర్గ ప్రజలకు సుమారు రూ.6 కోట్ల మేర సహాయం అందిందని కొనియాడారు.

**25 ఏళ్ల అనుభవంతో వేలాది కుటుంబాలకు సంతానం**

గత 25 సంవత్సరాలుగా ఐవీఎఫ్ రంగంలో శాస్త్రవేత్తగా సేవలందిస్తూ అనేక పరిశోధనలు నిర్వహించామని డాక్టర్ థామస్ తెలిపారు. ఇప్పటివరకు వేలాది మంది దంపతులకు సంతాన సౌభాగ్యం కల్పించామని చెప్పారు. కడప జిల్లాలో 7 వేల మందికి పైగా, పులివెందులలో 500 మందికి పైగా సంతానాన్ని అందించే కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 నుంచి 80 వరకు ఫెర్టిలిటీ క్యాంపులు నిర్వహించి, చికిత్స అవసరమైన వారికి సేవలు అందిస్తున్నామని వివరించారు.



**పేదలకు వరంగా మారిన ఫెర్టిలిటీ క్యాంపులు**

మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యాధునిక సంతానోత్పత్తి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్న డాక్టర్ థామస్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. సంతానం లేక బాధపడుతున్న దంపతులకు ఆశ నింపుతూ, వారికి తగిన చికిత్సలు అందించి వేలాది కుటుంబాల్లో ఆనందాన్ని నింపారని కొనియాడారు. ఇప్పటివరకు సుమారు 80 వేల మంది దంపతులకు సంతాన సౌభాగ్యం కల్పించడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయుడుపేటకు చెందిన సామాజిక సేవకుడు వీజే గోను నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ వి.ఎం. థామస్‌ను ఘనంగా సన్మానించారు. సంతానలేమితో బాధపడుతున్న వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తూ, అత్యాధునిక వైద్య సేవలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్న డాక్టర్ థామస్ సేవలను కొనియాడారు. సమాజ సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని పేర్కొంటూ, శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ థామస్ సేవలు మరింత విస్తరించి, ఇంకా ఎక్కువ మంది దంపతులకు సంతాన సౌభాగ్యం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, సంతాన ఉత్పత్తి కొరకు వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల పాలిట కంటి వెలుగులు..

- తుమ్మిగనూరులో ఉచిత వైద్య శిబిరం



**కనేకల్ – సూర్య వాస్తవం:** కనేకల్ మండలంలోని తుమ్మిగనూరు గ్రామంలో నంద్యాల శాంతిరాం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 200 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. పరీక్షల అనంతరం 30 మంది రోగులకు కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, వారిని నంద్యాలలోని శాంతిరాం హాస్పిటల్‌కు ఉచితంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. శస్త్రచికిత్సతో పాటు భోజనం, వసతి సదుపాయాలు కల్పించి, అనంతరం రోగులను వారి స్వగ్రామాలకు ఉచితంగా చేర్చనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆరుగురు రోగులను మెరుగైన వైద్యం కోసం సవేరా హాస్పిటల్‌కు పంపించినట్లు వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. శాంతిరాం హాస్పిటల్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వారు హర్షం వ్యక్తం చేశారు.

## కనేకల్‌లో పంచాయతీ నిర్లక్ష్యం..

- గుంతలో పడితే ఆసుపత్రే దిక్కు..!- గుంత పూడ్చని పంచాయతీ..
ప్రజల ప్రాణాలకు ముప్పు- సిబ్బంది కొరత ఏమైనా ఉందా?



**కనేకల్– సూర్య వాస్తవం :** కనేకల్ పట్టణ నడిబొడ్డున తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతను పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు పూర్తయినప్పటికీ గుంతను అలాగే వదిలేయడం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.తాగునీటి సరఫరా జరిగే పైప్‌లైన్ వద్ద తవ్విన ఈ గుంతకు కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వెలుతురు సరిగా లేకపోవడం, విద్యుత్ అంతరాయాల సమయంలో గుంత కనిపించక వాహనదారులు, పాదచారులు, మూగజీవాలు కూడా ఇందులో పడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రాకపోకలు అధికంగా ఉంటాయని, చిన్నారుల భద్రత దృష్ట్యా వెంటనే గుంతను పూడ్చాలని వారు కోరుతున్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో మరమ్మతుల అవసరాల కోసం ఈ ప్రదేశంలో శాశ్వత చాంబర్ నిర్మించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- ప్రమాదంలో మరోసారి రుజువు
- హెల్మెట్ కాపాడిన ప్రాణం..
- భారీ ప్రమాదం నుంచి రైతు సురక్షితం
- తల్వాయపాడు సమీపంలో రోడ్డు ప్రమాదం
- ఇద్దరికి గాయాలు
- మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు

# హెల్మెట్ ఉంటేనే భద్రత..



**పెళ్లకూరు–సూర్య వాస్తవం:** రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఎంతటి రక్షణ కవచమో తల్వాయపాడు సమీపంలో జరిగిన ఓ ప్రమాదం మరోసారి స్పష్టం చేసింది. భారీ ప్రమాదం జరిగినప్పటికీ హెల్మెట్ ధరించి ఉండడంతో ఓ రైతు ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే, తిరుపతిలోని అవిలాలకు చెందిన జమాలుద్దీన్ యాజమాన్యంలోని టాటా ఏస్ వాహనం (ఏపీ 39 యు యు 5782) డ్రైవర్ అక్బర్ నడుపుతూ తిరుపతి నుంచి నాయుడుపేటకు ఎండు టెంకాయల లోడుతో వస్తున్నాడు. ఈ క్రమంలో తల్వాయపాడు ట్రాక్టర్ షోరూం సమీపంలో ముందుగా వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దిగువ చావలి గ్రామానికి చెందిన రైతు శ్రీపతి చంద్రయ్య బైక్ ( టి ఎన్ 18 ఈ 5639) నడుపుతుండగా, వెనుక సీటులో విలపాక సిద్ధమ్మ ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో దిగువ చావలి గ్రామానికి చెందిన రైతు శ్రీపతి చంద్రయ్య బైక్ నడుపుతుండగా, వెనుక సీటులో విలపాక సిద్ధమ్మ ప్రయాణిస్తున్నారు. ఒక్కసారిగా టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదం తీవ్రతకు రోడ్డుపై రక్తపు చారలు కనిపించగా, సంఘటనను చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అయితే విలపాక సిద్ధమ్మ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రీపతి చంద్రయ్య వృత్తిరీత్యా రైతు. తాను కష్టపడి పండించిన పూలను నాయుడుపేట మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం కుటుంబ సభ్యులను, బంధువులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ చంద్రయ్య హెల్మెట్ ధరించి ఉండటంతో తలకు పెద్దగా గాయాలు కాకుండా ప్రాణాపాయం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలు తలకు తీవ్ర గాయాలు కావడం వల్లనే సంభవిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఘటన కూడా హెల్మెట్ ప్రాణాలను కాపాడగలదనే విషయాన్ని మరోసారి నిరూపించిందని స్థానికులు పేర్కొన్నారు.


ద్విచక్ర వాహనదారులు కేవలం జరిమానాలకు భయపడి కాకుండా తమ ప్రాణాల రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ ఘటనను ఉదాహరణగా తీసుకుని ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు నాణ్యమైన హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఒక చిన్న జాగ్రత్త ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నివారించగలదని ఈ ప్రమాదం మరోసారి గుర్తు చేసింది. "హెల్మెట్ కేవలం జరిమానా తప్పించుకోవడానికి కాదు... ప్రాణాలను కాపాడుకోవడానికి. తల్వాయపాడు ప్రమాదం దీనికి ప్రత్యక్ష ఉదాహరణ."





## ఒకే రోజు 12 షార్ట్ ఫిల్మ్స్

## అమితాబ్ జోష్ కు ఫ్యాన్స్ ఫిదా



ముంబయి : వయసు కేవలం సంఖ్య మాత్రమేనని మరోసారి నిరూపించారు బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్. 82 ఏళ్ల వయసులోనూ యువ హీరోలకు ఏమాత్రం తీసిపోని ఉత్సాహంతో పనిచేస్తున్న బిగ్ బి. ఒకే రోజులో 12 షార్ట్ ఫిల్మ్స్ షూటింగ్‌తో పాటు రెండు స్టిల్ ఫొటోషూట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. తన అభిమానులను 'ఎక్స్‌టెండెడ్ ఫ్యామిలీ'గా పిలిచే అమితాబ్ తన బ్లాగ్‌లో ఈ విషయాన్ని పంచుకున్నారు. "పని అంటే పనే. ఈ రోజు 12 షార్ట్ ఫిల్మ్స్ షూట్ చేశాను. రెండు స్టిల్ షూట్లు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడు మీతో కనెక్ట్ అవుతున్నాను. మిగతావన్నీ కొనసాగుతూనే ఉంటాయి. కానీ ఈ అనుబంధం మాత్రం ఆగకూడదు. పని విషయంలో రాజీ పడకూడదు" అని పేర్కొన్నారు. రోజూ కొత్తగా నేర్చుకుంటూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలని బ్లాగ్‌లో చెప్పారు. ప్రస్తుతం నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న 'కల్కి 2898 ఏఐ' సీక్వెల్‌లో అమితాబ్ బచ్చన్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, కమల్ హాసన్, దీపికా పడుకొణె, దిశా పటానీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల ఆయన 'వెట్టాయన్' చిత్రంలో నటించారు. టి.జె. జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రజినీకాంత్, ఫహద్ ఫాసిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

# మా ఇంటి బంగారం' కు సెన్సార్ అభినందన



ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఈనెల 19న విడుదల కాబోతోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లతో సినిమా టీం ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన సెన్సార్ పూర్తయింది. ఈ చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ సభ్యులు మేకర్స్‌ను అభినందించారు. ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ఈ చిత్రం ఈనెల 19న గ్రాండ్ రిలీజ్‌కు రెడీగా ఉంది. ఇప్పటికే సమంత ఈ సినిమా గురించి ఎన్నో విశేషాల్ని పంచుకున్నారు. తాజాగా ఇన్ స్టాలో తన అభిమానులతో ముచ్చటిస్తూ ఈ మూవీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రేక్షకులు పెట్టే డబ్బు, వెచ్చించే సమయం ఇలా అన్నింటికీ న్యాయం చేసేలా సినిమా ఉంటుందని టీం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించారు. ఓం ప్రకాష్ కెమెరామెన్‌గా, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా పని చేశారు. అన్ని తరగతుల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు ఈ సినిమా 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ చిత్రంలో శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి,శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుష,దిగంత్,గుల్షన్ దేవయ్యలు ముఖ్య పాత్రలు పోషించారు.

# సెప్టెంబరు 4 న 'మండాడి'




టాలీవుడ్ యాక్టర్ సుహాస్, కోలీవుడ్ యాక్టర్ సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'మండాడి'. ఈ ఏడాది సెప్టెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తం గా విడుదల చేయబోతున్నారు. మత్స్యకారుల జీవితాలు, తీరప్రాంత నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై ఎల్రెడ్ కుమార్ సమర్పణలో నిర్మించారు. 80 కోట్ల బడ్జెట్‌తో ఈ యాక్షన్ డ్రామా రూపుదిద్దుకుంది. రియల్ లొకేషన్స్‌లో సెయిల్‌బోట్ రేస్ సీక్వెన్స్‌లను, యాక్షన్ ఎపిసోడ్‌లను షూట్ చేశారు. ఈ సినిమాలో సుహాస్, సూరి ఇద్దరూ రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించబోతున్నా రు. ఈ చిత్రానికి వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. మదిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయింది. మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సీనియర్ యాక్టర్ సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించారు.



- స్పిన్ మాయాజాలంతో ఒంటిచేత్తో మ్యాచ్‌ను తిప్పేసిన దీప్తి శర్మ (5/10)
- ధనాధన్ బ్యాటింగ్‌తో మెరిసిన స్మృతి మంధాన (68), హర్మన్‌ప్రీత్ (36)
- టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా బోణీ

# భారత్ 'ధంకా'..

# పాకిస్థాన్‌పై ఘన విజయం!



**వాస్ట్ బాస్టన్ :** ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లోనే చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత మహిళల జట్టు చిత్తుచిత్తుగా ఓడించింది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన హైవోల్టేజ్ పోరులో సర్వసంగ్రామానికి సిద్ధమైన పాక్‌ను భారత్ 64 పరుగుల తేడాతో మట్టికరిపించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్థాన్.. భారత స్పిన్ మాంత్రికురాలు దీప్తి శర్మ (5/10) ధాటికి తట్టుకోలేక 106 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ స్మృతి మంధాన (44 బంతుల్లో 68, 9 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి పునాది వేసింది. పాక్ బౌలర్లను ఫోర్లు, సిక్సర్లతో చెడుగుడు ఆడుకుంటూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 36) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో అండగా నిలిచింది.

## చరిత్ర సృష్టించిన యువ కెప్టెన్ గిల్



**హిమాచల్ ప్రదేశ్ (ధర్మశాల) :** ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టుకు విజయాన్ని అందించిన యువ కెప్టెన్ శుభ్ మన్ గిల్ మరో విశిష్ట ఘనతను తన పేరుమీద నమోదు చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 3000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగా గిల్ కొత్త రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో అజేయంగా 84 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లో 3000 వన్డే పరుగుల మైలురాయిని కేవలం 62 ఇన్నింగ్స్‌ల్లోనే చేరుకున్నాడు. దీంతో గతంలో 72 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించిన శిఖర్ ధావన్ రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో 75 ఇన్నింగ్స్‌ల్లో 3000 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఉన్నాడు. ప్రపంచ స్థాయిలో చూస్తే, 57 ఇన్నింగ్స్‌ల్లోనే 3000 పరుగులు సాధించిన హాషీమ్ ఆమ్లా మాత్రమే గిల్ కంటే ముందున్నాడు. వర్షం కారణంగా నాలుగు గంటలకు పైగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు, ఓపెనర్ గుర్బాజ్ (51 బంతుల్లో 102 పరుగులు) శతకంతో 194 పరుగులు సాధించింది. 195 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు గిల్ అద్భుత ఆరంభాన్ని అందించాడు. అతను 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 84 పరుగులు చేసి చివరి వరకు నిలిచాడు. మరోవైపు కెఎల్ రాహుల్ 19 బంతుల్లో 39 పరుగులతో కీలక సహకారం అందించాడు. ఫలితంగా భారత్ 2.3 ఓవర్లు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయాన్ని ఖాయం చేసింది. ఈ గెలుపుతో మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది

## ఖతార్, స్విట్జర్లాండ్ మ్యాచ్ డ్రా



ఫిఫా ప్రపంచకప్‌లో ఖతార్ జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. గ్రూప్-బిలో భాగంగా స్విట్జర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరును 1-1తో డ్రా చేసుకోవడం ద్వారా, ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఖతార్ తొలిసారిగా తన ఖాతాలో ఒక పాయింట్‌ను వేసుకుంది. మ్యాచ్ ప్రారంభమైన 17వ నిమిషంలోనే స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంబోలో పెనాల్టీ ద్వారా గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత స్విస్ జట్టు మైదానంలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, ఖతార్ రక్షణ శ్రేణిని ఛేదించి మరో గోల్ సాధించలేకపోయింది. ఇక మ్యాచ్ స్విట్జర్లాండ్ వశమౌతుందనుకుంటున్న తరుణంలో.. చివరి నిమిషంలో ఖతార్ అనూహ్యంగా పుంజుకుంది. ఇంజూరీ టైమ్‌లో (90ం4వ నిమిషంలో) ఖతార్ ఆటగాడు బౌలెమ్ ఖౌఖీ అద్భుతమైన హెడర్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి స్కోరును సమం చేశాడు. దీంతో ఇరు జట్లు చెరో పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఓటమి అంచుల్లోంచి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన ఖతార్, మెగా టోర్నీలో తన మొదటి పాయింట్‌ను నమోదు చేసి సరికొత్త మైలురాయిని అందుకుంది.

## ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్‌కు స్వర్ణం



ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తుర్కియేలో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 పోటీలో భారత్ స్వర్ణం గెలుచుకుంది. ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తుర్కియేలో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 పోటీలో భారత్ స్వర్ణం గెలుచుకుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు చెందిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహోద్.. ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ అయిన దక్షిణ కొరియాను వరుస సెట్లలో ఓడించారు. దక్షిణ కొరియాకు చెందిన ఓహ్ యే-జిన్, కిమ్ జె-డివోక్‌పై 5-1 తేడాతో విజయం సాధించారు. నాలుగేళ్ల తర్వాత భారత్ వరల్డ్ కప్ స్టేజ్‌లో ఈ విభాగంలో బంగారు పతకం సాధించింది. చివరిసారిగా 2022 ఈవెంట్‌లో రిధి ఫోర్ - తరుణ్‌దీప్ రాయ్ జోడీ గోల్డ్‌ను గెలుచుకుంది.

# ఒమన్ తీరంలో భారత్ నౌకకు ప్రమాదం

## -14 మంది సిబ్బంది సురక్షితం



**మస్కట్ -సూర్య వాస్తవం:** ఒమన్ తీరంలో భారతీయ జెండాతో ప్రయాణం చేస్తున్న నౌక ప్రమాదానికి గురయింది. ఈ నౌకలో ఉన్న మొత్తం 14 మంది సిబ్బందిని రక్షించారు. ఈ విషయాన్ని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఆదివారం వెల్లడించింది. 'భారత జెండా కలిగిన ఎంఎస్‌వి విరాట్ 1 లో చేపట్టిన సహాయక చర్యలు విజయవంతంగా పూర్తయ్యాయి. నౌకలోని 14 మంది సిబ్బందిని రక్షించారు. సిబ్బంది క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారు' రాయబార కార్యాలయం ఒక సోషల్ మీడియా పోస్టులో తెలిపింది. రక్షించిన సిబ్బందిని ముంబయి వెళ్తున్న జబల్ అలీ 9 నౌకలోకి తరలించినట్లు తెలిపింది. ఇంజన్ వైఫల్యంతో ఎంఎస్‌వి విరాట్ 1 ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. విరాట్ 1 50 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు కలిగిన ఒక చిన్న నౌక. పర్షియన్ గల్ఫ్ దేశాలకు పరిమితంగా సామాగ్రిని, త్వరగా పాడైపోయే ఆహార పదార్థాలను తీసుకుని వెళ్లడానికి ఈ మార్గం చిన్న నౌకలు ప్రయాణం చేస్తుంటాయి. అయితే ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# బీజింగ్ చేరిన నేపాల్ మంత్రి



**బీజింగ్ -సూర్య వాస్తవం:** నేపాల్ మంత్రి షిశిర్ ఖనల్ ఆదివారం చైనా రాజధాని బీజింగ్ చేరుకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో నేపాల్‌లో జరిగిన ఎన్నికలలో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పీ) ఘన విజయం సాధించిన నేపథ్యంలో చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను పెంచుకునే ఉద్దేశంతో ఆయన బీజింగ్ పర్యటనకు వచ్చారు. చైనా పర్యటనకు ముందు ఖనల్ భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల చైనా పర్యటనలో భాగంగా ఆయన చైనా ఆర్థిక మంత్రి వాంగ్ యీతో సమావేశమవుతారు. చైనా ఉన్నత స్థాయి అధికారులతో కూడా చర్చలు జరుపుతారు.

# దక్షిణ బీరుట్‌పై ఇజ్రాయిల్ దాడులు



**బీరుట్ -** లెబనాన్ రాజధాని బీరుట్‌లోని దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయిల్ సేనలు ఆదివారం బాంబు దాడులు జరిపాయి. ఓ భవనంపై జరిగిన దాడిలో ఇద్దరు చనిపోగా నలుగురు గాయపడ్డారు. బీరుట్‌లో షియాలు అధికంగా నివసిస్తున్న దహియె ప్రాంతంపై ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. ఆ ప్రాంతం జనసమ్మర్దంగా ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాలు ఎక్కువగా ఉంటాయి. దహియెలోని హిజ్బుల్లా కమాండ్ కేంద్రంపై దాడి చేశానని ఇజ్రాయిల్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ఇజ్రాయిల్ దళాలు కాల్పుల విరమణను ఉల్లంఘించినందుకు ప్రతిగా మజ్దల్ జౌన్ పట్టణ శివారు ప్రాంతంలో వాహనాలు, సైనికులను లక్ష్యంగా చేసుకొని రాకెట్ దాడులు చేశామని హిజ్బుల్లా తెలిపింది.

# భారత తదుపరి ఆర్మీ చీఫ్‌గా

## లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకం

**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** భారత సైన్యానికి తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (జూూూ)గా ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ నిర్ణయాన్ని రక్షణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది జూన్ 30న పదవీ విరమణ చేయనుండగా, అదే రోజు లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్తుతం భారత సైన్యానికి వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా సేవలందిస్తున్నారు. సైన్యంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయనకు వ్యూహాత్మక, ఆపరేషనల్ రంగాల్లో విశేష అనుభవం ఉంది. రక్షణ రంగ ఆధునికీకరణ, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలకు ఆయన ప్రాధాన్యత ఇచ్చిన అధికారిగా గుర్తింపు పొందారు. ధీరజ్ సేథ్ నియామకంతో భారత సైన్యానికి అనుభవజ్ఞుడైన నాయకత్వం లభిస్తుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దేశ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయన నాయకత్వం కీలకంగా ఉండనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# శాంతి ఒప్పందంపై అనిశ్చితి

## - సమీక్ష తర్వాతే నిర్ణయం : ఇరాన్

**టెహ్రాన్/వాషింగ్టన్-సూర్య వాస్తవం:** మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఉద్దేశించిన శాంతి ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతోంది. ఆదివారం సంతకాలు జరుగుతాయని, ఆ వెంటనే హార్ముజ్ జలసంధిని తెరుస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ తెలిపారు. ఇరాన్ ఇక అణ్వాయుధాన్ని కోరుకోవడం లేదని, శుద్ధి చేసిన యురేనియంను సరైన సమయంలో తొలగించేందుకు టెహ్రాన్‌కు అమెరికా సాయపడుతుందని చెప్పారు. అయితే ఈ వాదనను ఇరాన్ తోసిపుచ్చింది. ఒప్పందంపై 'రాబోయే రోజులలో' సంతకాలు జరుగుతాయని చెప్పింది. ఒప్పందంపై టెహ్రాన్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ మీడియా తెలియజే సింది. కాగా ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో సాయపడేందుకు ఖతార్ మధ్య వర్తులు హుటా హుటిన టెహ్రాన్ చేరుకున్నారని సమాచారం.



### ఇంకా నిర్ణయం తీసుకోలేదు

అమెరికాతో అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు జరుగుతాయన్న వార్తలను ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై తోసిపుచ్చారు. ఇప్పుడు కుదుర్చుకునే ఎంఓయూ తదుపరి చర్చలకు ఉపకరిస్తుందే తప్ప తుది ఒప్పందానికి కాదని స్పష్టం చేశారు. అరవై రోజుల కాల్పుల విరమణపై ఒప్పందం కుదిరితేనే అణు కార్యక్రమంపై సంప్రదింపులు కొనసాగుతాయని చెప్పారు. చర్చల సందర్భంగా ప్రతిపాదించిన ఎంఓయూపై ఇరాన్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, రాజకీయ, న్యాయ, సాంకేతిక కోణాల నుంచి సమీక్ష కొనసాగుతోందని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలియజేసింది. చర్చలలో పురోగతి ఉన్నప్పటికీ అంతరంగిక సమీక్షా ప్రక్రియపై తుది నిర్ణయం ఆధారపడి ఉంటుందని ఇరాన్ అధికారులు చెప్పారు. ఇదిలావుండగా శాంతి ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ మషాద్ నగరంలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఎదుట కొందరు ప్రదర్శన నిర్వహించారు. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతి ఒప్పందం ఇరాన్ ప్రయోజనాలను కాపాడబోదని, హార్ముజ్‌పై టెహ్రాన్‌కు ఉన్న హక్కును నీరుకారుస్తుందని ప్రదర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒప్పందం కోసం ఇరాన్ ప్రతినిధులు అమెరికాకు అనేక రాయితీలు ఇస్తున్నారని మండిపడ్డారు.

### నౌకలకు ఐఆర్‌జీసీ హెచ్చరిక

హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) హెచ్చరికలు జారీ చేసింది. హార్ముజ్ కారిడార్‌లో రాకపోకలు సాగించే నౌకలపై చర్యలు తప్పవని ఓ ఆడియో సందేశంలో స్పష్టం చేసింది. 'మీ ఆరోగ్యం, రక్షణ కోసం చెబుతున్నాం. తదుపరి నోటీసు జారీ చేసే వరకూ హార్ముజ్‌లో నౌకాయానానికి స్వస్తి చెప్పండి' అని సూచించింది. కాగా భారత పతాకంతో ప్రయాణిస్తున్న విరాట్-1 అనే నౌక ఓమన్ తీరంలో ఇంజిన్ వైఫల్యానికి గురైంది. ఈ నౌకలో 14 మంది భారతీయ సిబ్బంది ఉన్నారని, వారందరినీ రక్షించడం జరిగిందని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలియజేసింది.

# తుది నిర్ణయం ఇంకా ఖరారు కాలేదు: ఇరాన్

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో చర్చల్లో ఉన్న ఒప్పందంపై సంతకంపై తుది నిర్ణయం ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ మీడియా 'ఫార్స్' వార్తా సంస్థ ఆదివారం తెలిపింది. "చర్చల సమయంలో ప్రతిపాదించిన అవగాహన ఒప్పందానికి సంబంధించి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఇంకా తన తుది నిర్ణయాన్ని తీసుకోలేదు లేదా ప్రకటించలేదు" అని ఇరాన్ చర్చల బృందానికి అత్యంత సన్నిహితంగా ఉన్న ఒక వర్గం వెల్లడించినట్లు మీడియా తెలిపింది. ఖతార్ ప్రతినిధి బృందం ఆదివారం టెహ్రాన్‌కు చేరుకుందని మరో ఇరాన్ మీడియా తస్నీమ్ పేర్కొంది. ఖతార్ విదేశాంగ మంత్రి సలహాదారు ఒకరు ఇరాన్‌కు చేరుకున్నారని, దౌత్యపరమైన ప్రక్రియకు సంబంధించిన తాజా పరిణామాలను సమీక్షించడం ఈ పర్యటన ఉద్దేశమని తెలిపింది.



పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో ఒక ఒప్పందంపై ఆదివారం సంతకాలు జరుగుతాయని, ఆ వెంటనే వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన 'హోర్ముజ్ జలసంధి' అందరికీ అందుబాటులోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే, ఒప్పందంపై సంతకం చేసే తేదీ ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బకాయి పేర్కొన్నారు. అదే సమయంలో భవిష్యత్తులో సంతకం చేసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అన్నారు.

### లెబనాన్ లో 29 గ్రామాలకు హెచ్చరికలు :

ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్ తో కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ, ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని 29 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా స్థానికులకు హెచ్చరికలు జారీ చేసింది. దాడులకు ముందు సైన్యానికి చెందిన అరబిక్ భాషా ప్రతినిధి కల్నల్ అవిచాయ్ వరుసగా రెండు హెచ్చరికలు జారీ చేశారు. మొదట 13 గ్రామాలను, అనంతరం మరో 16 గ్రామాలను హెచ్చరించారు. జహ్రానీ నదికి ఉత్తరాన ఉన్న కమ్యూనిటీలు లక్ష్యంగా రెండవ హెచ్చరికను జారీ చేశారు. లెబనాన్ కి చెందిన హెజ్బుల్లా గ్రూప్ రెండు డ్రోన్ లను ప్రయోగించిందని ఇజ్రాయిల్ మిలటరీ ఆదివారం తెలిపింది. ఇవి ఉత్తర ఇజ్రాయిల్ ను తాకాయని, కానీ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.

# ఇది తీవ్రమైన క్విడ్ ప్రోకో ఆఫర్

- డబ్బుతో న్యాయాన్ని కొనేందుకు బరితెగింపు
- అదానీ ప్రతిపాదనపై మండిపడ్డ డెమొక్రాట్ సెనెటర్లు
- తాత్కాలిక అటార్నీ జనరల్‌కు లేఖ

**వాషింగ్టన్ -సూర్య వాస్తవం:** తనపైమోపిన ఆరోపణలను ఉపసంహరించుకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థలో పది బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానంటూ అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ చేసిన ప్రతిపాదనపై డెమొక్రాట్ సెనెటర్లు మండిపడ్డారు. ఇది 'తీవ్రమైన క్విడ్ ప్రోకో ఆఫర్' మాదిరిగా కన్పిస్తోందని తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లంచ్‌కి రాసిన లేఖలో డెమొక్రాట్ సెనెటర్లు ఎలిజబెత్ వారెన్, రిచర్డ్ బ్లూమెంతల్ తెలియజేశారు. అదానీపై మోపిన నేరపూరిత ఆరోపణలను ఉపసంహరిం చుకోవాలంటూ న్యాయస్థానాన్ని అమెరికా న్యాయ శాఖ అభ్యర్థించడం వెనుక ఉన్న 'లావాదేవీల స్వభావా'న్ని వారు ప్రశ్నించారు. గత నెల 18న న్యాయ శాఖ న్యూయార్క్ న్యాయమూర్తికి ఓ విన్నపాన్ని పంపుతూ అదానీపై మోపిన ఆరోపణల విషయంలో తదుపరి చర్యలకు స్వస్తి చెప్పాలని తన విచక్షణాధికారం మేరకు నిర్ణయం తీసుకున్నానని తెలియజేసింది. అయితే దీనిపై న్యాయమూర్తి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగత



న్యాయవాదులలో ఒకరైన రాబర్ట్ జే గిఫ్రా జూనియర్ నేతృత్వంలోని లీగల్ బృందాన్ని గౌతమ్ అదానీ నియమించుకున్న నేపథ్యంలో ఆయనపై ఉన్న అభియోగాలను ఉపసంహరించుకోవాలని న్యాయ శాఖ యోచిస్తోందని 'ది న్యూయార్క్ టైమ్స్' పత్రిక అంతకుముందు తెలియజేసింది. 'అధ్యక్షుడి వ్యక్తిగత న్యాయవాదులలో ఒకరి సాయంతో అనేక బిలియన్ డాలర్ల లంచం కుంభకోణం కేసు నుంచి అదానీ బయటపడ్డారు. అందుకోసం అమరికాలో భారీగా పెట్టుబడులు పెడతానని హామీ ఇచ్చారు' అని తాత్కాలిక అటార్నీ జనరల్‌కు రాసిన లేఖలో డెమొక్రాట్ సెనెటర్లు ఆరోపించారు. తనపై ఉన్న అభియోగాలను ఉపసంహరించుకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెడతానంటూ అదానీ చేసిన ప్రతిపాదన 'శిక్షలో సడలింపులను డబ్బుతో కొనుక్కునేందుకు ఓ ధనవంతుడు చేసిన బరితెగింపు ప్రయత్నం'గా కన్పిస్తోందని మండిపడ్డారు. అదానీపై అభియోగాలను ఉపసంహరించుకోవాలని న్యాయ శాఖ తీసుకున్న నిర్ణయం అవినీతి ప్రవర్తనలో అది కూడా సమాన భాగస్వామేనన్న అభిప్రాయాన్ని కలిగిస్తోందని అన్నారు.

### ఏమిటీ కేసు?

సౌర ఇంధన కాంట్రాక్టు కోసం భారత్‌లోని అధికారులకు లంచాలు ఇవ్వడానికి 265 మిలియన్ డాలర్ల మోసపూరిత పథకానికి గౌతమ్ అదానీ రూపకల్పన చేశారు. ఈ నేపథ్యంలలో అమెరికా పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చారనే ఆరోపణపై గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై 2024 నవంబరులో అధికారులు అభియోగాలు మోపారు. నిధుల కోసం ముడుపుల సమాచారాన్ని వారు దాచిపెట్టారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తోసిపుచ్చింది. సెక్యూరిటీల మోసం ఆరోపణలపై గౌతమ్, సాగర్‌లపై అభియోగాలు మోపారే తప్ప ముడుపుల ఆరోపణలపై కాదని అదానీ గ్రూప్ 2024 నవంబరులో స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది. కాగా అమెరికా న్యాయ శాఖ క్రిమినల్ ఆరోపణలను ఉపసంహరించుకున్నప్పటికీ గౌతమ్ అదానీ ఆర్థిక జరిమానాలు చెల్లించే అవకాశం ఉందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )